

### కాంగ్రెస్ పాలనలో కర్షకులకు కష్టాలు

పదేళ్ల కేసీఆర్ పాలనలో తాగు, సాగునీటికి ఏనాడూ ఇబ్బంది పడే పరిస్థితి లేకుండా చేసినం. ఎండకాలంలోనూ చెరువులు, కుంటలు మత్తళ్లు దుంకినయ్. కానీ, కాంగ్రెస్ పాలనలో కర్షకులకు కష్టాలు మొదలైనయ్. నాడు సంతోషంగా పంటలు పండించుకున్న రైతులు, ఇప్పుడు ఎండుతున్న పంటలు, నెర్రెలుబారిన పొలాలను చూసి దుఃఖపడుతున్నరు. అధికారులు, మంత్రులు అందుబాటులో లేకపోవడంతో తమ సమస్యలను ఎవరికీ చెప్పుకోవాలో తెలియక ఆగమవుతున్నరు. పండిన పంటకు కూడా గిట్టుబాటు ధర రాదేమోనని ఆందోళనకు చెందుతున్నరు. కాంగ్రెస్ సర్కారు ఇప్పటికైనా ఎస్సారార్ రిజర్వాయర్‌ను నింపి ఎండుతున్న పంటలను కాపాడాలి. ఎల్ఎండీ డెడ్‌స్టోరేజీకి చేరింది. కరీంనగర్ ప్రజలు తాగునీటికి గోసపడే దుస్థితి ఉన్నది. ప్రభుత్వం స్పందించి సాగు, తాగునీరందేలా చర్యలు చేపట్టాలి. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాడు కరీంనగర్ నుంచే ప్రత్యేక ఉద్యమానికి శ్రీకారం చుట్టిండు. ఇప్పుడు కూడా పార్లమెంట్ ఎన్నికలకు కరీంనగర్ నుంచే కదనభేరి మోగిస్తున్నడు. ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలి.

**- గంగుల కమలాకర్, మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే**



### సంజయ్.. ఎప్పుడైనా పార్లమెంట్‌లో మాట్లాడారా..?

కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ఐదేళ్ల కాలంలో ఏ రోజైనా పార్లమెంట్‌లో ప్రజా సమస్యలపై మాట్లాడారా..? అబద్ధాలు చెప్పడం, అభాండాలు వేయడం తప్పా పైసా పనైనా చేశారా..? తెలంగాణకు జాతీయ ప్రాజెక్టులు ఇవ్వాలని నేను లోక్‌సభలో గళమెత్తిన. పదిసార్లు కేంద్రాన్ని అడిగిన. మిషన్ భగీరథ, జాతీయ రహదారులకు నిధులివ్వాలని విజ్ఞప్తి చేసిన. కరీంనగర్‌కు ట్రిపుల్ ఐటీ ఇవ్వాలని కొట్లాడిన. హైదరాబాద్ రామగుండం దారిలోని రక్షణ శాఖ భూములు ఇవ్వాలని ఐదుగురు ఎంపీలతో కలిసి వెళ్లి అడిగిన. కానీ, మోడీ సర్కారు మొండిచెయ్యి చూపింది. గత ఎన్నికల్లో ఒడిపోయినా కరీంనగర్‌లోనే ఉన్న. అనునిత్యం బీఆర్ఎస్ కార్యకర్తలకు అండగా నిలిచిన. కానీ, ప్రస్తుత ఎంపీ సంజయ్ ఏ ఒక్క ప్రాజెక్టుకు నిధులు తేలేదు. కానీ, కులమతాల పేరిట వైషమ్యాలు రెచ్చగొడుతున్నడు. ఇలాంటి నాయకుడు మనకు అవసరమా? ప్రజలు ఆలోచించాలి. తెలంగాణ ప్రజలకు హక్కులు దక్కాలంటే పార్లమెంట్‌లో బీఆర్ఎస్ ఉండాల్సిందే.

**- బీ వినోద్‌కుమార్, కరీంనగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి**



మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్,



కదనభేరి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్, బీఆర్ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్, వేదికపై ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పాడి కౌశిక్‌రెడ్డి, కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల జడ్పీ చైర్‌పర్సన్లు కనుమల్ల విజయ, దావ వసంత, న్యాలకొండ అరుణ, మేయర్ సునీల్‌రావు, నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి, మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్, వొడితల సతీశ్‌కుమార్, నాయకులు

# వినోద్‌ను భారీ మెజార్టీతో గెలిపిద్దాం

- కార్యకర్తలు ఎవరికి వారే కథనాయకులు కావాలి
- ఎవరి పోలింగ్ బూత్‌లో వారు మెజార్టీ తేవాలి
- కాంగ్రెస్ వైఫల్యాలపై ప్రజల్లో చర్చ పెట్టాలి
- ఎండుతున్న పంటలకు నష్టపరిహారం ఇవ్వాలి
- సంజయ్.. ఐదేళ్లలో ఏం చేశావో చెప్పే దమ్ముందా?
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- కరీంనగర్ పార్లమెంట్ ముఖ్య కార్యకర్తల సమావేశం

**రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించి సత్తా చాటుదామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. ఇది ఏ ఒక్కరి కోసమో జరుగుతున్న ఎన్నిక కాదని, ప్రతి బీఆర్ఎస్ నాయకుడు తనకు తానుగా కథనాయకులై వారి పరిధిలో మెజార్టీ తేవాలని సూచించారు. కరీంనగర్ జిల్లాకేంద్రంలోని ప్రతిమ హోటల్‌లో గురువారం నిర్వహించిన పార్లమెంట్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై, పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంతోపాటు ఈ నెల 12న కదనభేరి విజయవంతంపై దిశానిర్దేశం చేశారు. ఒకవైపు బీఆర్ఎస్ నాయకులను ఉత్తేజ పరుస్తూనే.. మరోవైపు రేవంత్‌రెడ్డితోపాటు బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌పై నిప్పులు చెరిగారు.**



సమావేశానికి హాజరైన కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తలు

కార్పొరేషన్, మార్చి 7 : పార్లమెంట్‌లో మన కరీంనగర్ నియోజకవర్గ గొంతు వినపడాలంటే.. వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. కార్యకర్తలు కలిసి కట్టుగా పనిచేస్తే గెలుపు సునాయాసం అవుతుందని, అందుకోసం ఎవరికీ వారే కథానాయకులు కావాలని సూచించారు. ప్రస్తుతం ఎంపీగా కొనసాగుతున్న బండి సంజయ్ పిచ్చి మాటలు తప్ప.. నియోజకవర్గ అభివృద్ధికి చేసిందేమీలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వందరోజుల్లోగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల సాగునీరు అందక పంటలు పోండిపోతున్నాయని, వెంటనే పరిహారం చెల్లించాలన్నారు. ఈ సీజన్ నుంచే రైతులకు రూ.500ల బోనస్‌ను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల12న కరీంనగర్‌లో కదనభేరి విజయవంతం కోసం గురువారం స్థానిక ప్రతిమ హోటల్‌లో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. బీఆర్ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణరావు అధ్యక్షత వహించగా, ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్, ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పాడి కౌశిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్, వొడితల సతీశ్‌కుమార్‌తోపాటు ముఖ్య నాయకులు పాల్గొన్నారు. కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరై, కదనభేరి పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం శ్రేణులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మన ఎమ్మెల్యేలు లేరని, అక్కడి నాయకులకు అండగా నిలవాలంటే.. వినోద్‌కుమార్ గెలువాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు.


### కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టాలి

ఎన్నికల ముందు ఆచరణ సాధ్యం కాని ఎన్నో హామీలు ఇచ్చి, ప్రజలను భ్రమలో పెట్టి గద్దనెక్కిన కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లో ఎండ గట్టాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. అధికారంలో ఉన్నా.. లేకపోయినా ప్రజల పక్షాన నిలబడి పోరాడడమే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రథమ లక్ష్యమనే విషయాన్ని ఎవరూ మచిరిపోవద్దని సూచించారు. వంద రోజుల్లో కాంగ్రెస్ తన మ్యానిఫెస్టోలో పెట్టిన అన్ని హామీలను అమలు చేస్తామని చెప్పిన విషయాన్ని ప్రజలకు గుర్తు చేస్తూనే.. ఇప్పటి వరకు అమలుకు నోచని హామీలపై ప్రశ్నించాలన్నారు. మరో పది రోజులైతే వంద రోజులు అవుతుందని, ఇచ్చిన 420 హామీలు అమలు చేస్తుందా? అని ప్రశ్నించారు. మోడీకి రేవంత్‌రెడ్డి గులాం చేస్తున్నారని, ముంగిట పార్లమెంట్ ఎన్నికలు పెట్టుకొని 'మోదీ పెద్దన్న' అంటూ చెప్పడమే కాకుండా.. భవిష్యత్‌లోనూ మీ ఆశీస్సులు ఉండాలని కోరుతున్నారంటే.. దేశంలో కాంగ్రెస్ గెలువదని రేవంత్‌రెడ్డి ముందుగానే నిర్ణయానికి వచ్చారని అర్థమవుతుందన్నారు. అలాంటి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే అది మురుగు కాలువలో వేసినట్టే అవుతుందన్న విషయాన్ని ఆలోచించుకోవాలని సూచించారు.

### బండి ఐదేళ్లలో ఏం చేశారో చెప్పు?

అతిరథ మహారథులు ప్రాతినిధ్యం వహించిన కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో బండి సంజయ్ ఎలా గెలిచారో అర్థం కాని పరిస్థితి అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. నిజంగా గడిచిన ఐదేళ్లలో ఆయన నియోజకవర్గానికి ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. పదేళ్లుగా దేశ ప్రధానిగా మోడీ ఉన్నారని, అందులో ఐదేళ్లు ఎంపీగా వినోద్‌కుమార్, మరో ఐదేళ్లు సంజయ్ ఉన్నారని చెప్పారు. ఐదేళ్లలో వినోద్‌కుమార్ నియోజకవర్గానికి ఏం చేశారో చెప్పడానికి మేం సిద్ధంగా ఉన్నామని, మరి బండి సాధించిన ప్రగతి ఏంటో చెప్పడానికి సిద్ధమా? అని సవాల్ విసిరారు. 'కరీంనగర్ నడి ఒడ్డున ఉన్న కమాన్ వద్ద చర్చ పెట్టుకుందాం. టైం నువ్వే ఫిక్స్ చెయ్. మా పార్టీ నుంచి వినోద్‌కుమార్ వస్తరు. మీ పార్టీ నుంచి నువ్వు వచ్చే దమ్ముందా?' చెప్పాలని డిమాండ్ చేశారు. సంజయ్ మాట్లాడితే.. ఎవరికీ అర్థం కాదని ఎద్దేవా చేశారు. ఏనాడూ ఆయన ఈ అభివృద్ధి చేస్తానని చెప్పరని, ధర్మం కోసం పనిచేస్తామని నమ్మబలుకుతారని, అదే నిజమైతే ఒక మఠం పెట్టుకొని పని చేసుకోవచ్చు కదా.. ? ఎంపీ పదవెందుకు అంటూ ప్రశ్నించారు. చివరకు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను పట్టుకొని నీవు నీ తల్లికే పుట్టావని గ్యారంటీ ఏంటి? అంటూ సంజయ్ మాట్లాడుతున్నారంటే.. ఆయన ఏ స్థాయికి దిగజారారో అర్థం చేసుకోవాలని సూచించారు. అలాంటి వ్యక్తి ఎంపీగా కొనసాగేందుకు అర్హుడా ? అని ప్రజలు ఆలోచించాలని కోరారు. వినోద్‌కుమార్ వంటి మంచి మనిషిని భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు చల్మెడ లక్ష్మీనరసింహారావు, తుల ఉమ, జడ్పీ అధ్యక్షులు కనుమల్ల విజయ, దావ వసంత, ఆరుణ-రాఘవారెడ్డి, సుధీర్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లాల అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, తోట ఆగయ్య, నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, నాయకులు సర్దార్ రవీందర్‌సింగ్, అనిల్ కుర్మాచలం, బండ శ్రీనివాస్, గెల్లు శ్రీనివాస్, ప్రవీణ్‌రెడ్డి, రూప్‌సింగ్, కర్నె ప్రభాకర్, గూడూరి ప్రవీణ్, కర్ర శ్రీహరి, లోక బాపు రెడ్డి, రూప్‌సింగ్, ఏనుగు రవీందర్‌రెడ్డి, పొన్నం అనిల్, కరీంనగర్ మేయర్ సునీల్‌రావు, డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణి, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ పాల్గొన్నారు.

### కేసీఆర్ నమ్మకాన్ని నిలబెట్టాలి



కరీంనగర్ అంటే కేసీఆర్‌కు అపారమైన అభిమానం. ఆయన ఏ కార్యక్రమమైనా ఇక్కడి నుంచే శ్రీకారం చుడుతున్నరు. ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికల శంఖారావాన్ని ఈ గడ్డ నుంచే ప్రారంభిస్తున్నరు. తెలంగాణ అభివృద్ధికి రాత్రింబవళ్లు పనిచేసిండు. కేసీఆర్ దిగిపోంగనే కరెంట్ పోతున్నది. సాగునీరందక రైతాంగం బేజారవుతున్నది. రేవంత్ సర్కారు అస్తవ్యస్త నిర్ణయాలతోనే ఈ దుస్థితి నెలకొన్నది. కరీంనగర్ ప్రజలు ఆలోచించి పార్లమెంట్ ఎన్నికల్లో వినోద్‌కుమార్‌ను ఎంపీగా అఖండ మెజార్టీతో గెలిపించి కేసీఆర్ నమ్మకాన్ని నిలబెట్టాలి.

**- పాడి కౌశిక్‌రెడ్డి, హుజూరాబాద్ ఎమ్మెల్యే**

### వినోద్‌ను గెలిపిస్తే అభివృద్ధి



గత పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్ ప్రజలు బీజేపీకి పట్టంగట్టారు. కానీ కేంద్రం నియోజకవర్గ అభివృద్ధికి ఇచ్చిందేమీలేదు. ప్రజలకు ఒరిగిందేమీలేదు. ఒక్క ప్రాజెక్ట్ వచ్చిందిలేదు. గతంలో ఎంపీగా పనిచేసిన వినోద్ కరీంనగర్ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారు. స్మార్ట్‌సిటీతో పాటు అనేక ప్రాజెక్టులు తెచ్చిన్రు. ప్రజలు ఆలోచించాలి. మేలు చేసే వినోద్‌కుమార్‌ను మరోసారి భారీ మెజార్టీతో గెలిపించుకోవాలి. కార్యకర్తలు కష్టపడి పనిచేసి కరీంనగర్ గడ్డపై గులాబీ జెండాను రెపరెపలాడించాలె.

**- రసమయి బాలకిషన్, మాజీ ఎమ్మెల్యే**

# కాంగ్రెస్ అచ్చింది.. కరువు తెచ్చింది

- పంటలు కండ్ల ముందే ఎండుతున్నయి
- చావు తప్ప మాకు మరో పరిష్కారం లేదు
- కేటీఆర్ ఎదుట ఇరుకుల్ల గ్రామ రైతుల ఆవేదన
- రైతులకు రామన్న భరోసా



ఎండిన శ్రీనివాస్ పంట పొలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కేటీఆర్, నాయకులు

కరీంనగర్, మార్చి7 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/ కరీంనగర్ రూరల్, మార్చి 7: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గురువారం కరీంనగర్‌లో పర్యటించారు. జిల్లాకేంద్రంలో పార్లమెంట్ ముఖ్య కార్యకర్తల సమావేశం అనంతరం కరీంనగర్ మండలం ఇరుకుల్లలో ఎండిపోయిన పంటలను ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు మాజీ ఎంపీ వినోద్‌కుమార్‌తో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు తమ గోడు వెల్లబోసుకున్నారు. 'కేసీఆర్ పాలనలో కాలంతో పొంతన లేకుండా నీళ్లు ఇచ్చిన్రు. రెండు పంటలు పండించుకున్నం. గట్లనే నీళ్లత్తయిని ఈసారి కూడా వరి ఏసుకున్నం. కానీ, మోసం జరిగింది. నీళ్లత్తలేవు. మా కండ్లముందే పంటలు ఎండుతున్నయి. అడ్డగోలు ఖర్సులు పెట్టుకున్నం. మాకు చావు తప్ప మారో గతే కనపడుత లేదు' అంటూ తమ అవేదన వ్యక్తం చేశారు. ఎర్ర శ్రీనివాస్ తన ఎండిపోయిన పంటను చూపించారు. 'సార్.. పదేండ్లలో ఇటువంటి దరిద్రాన్ని నేను చూడలేదు. కేసీఆర్ సారు ఉన్నప్పుడు మత్తు నీళ్లొచ్చినయి. రెండు పంటలు వేసుకున్న. ఇప్పుడు జూడు పొలం పర్రెలు పెట్టింది. ఏమి జేయాలో అర్థమైతలేదు. ఇంత మోసం అయితదని అనుకోలే' అంటూ ఆవేదన చెందాడు. మరో రైతు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. 'ఇప్పటికే నా రెండెకరాలు ఎండిపోయింది. ఇంకో రెండెకరాలు గూడా ఎండిపోయేటట్టున్నది. చుక్క నీళ్లు ఇస్తలేరు. గింత అన్యాయమా? నాకు మనసున పడుతలేదు. మందు తాగి లెటర్ పెట్టి సచ్చిపోతా సర్' అంటూ ఆక్రోషం చెందాడు. వెంటనే జోక్యం చేసుకున్న కేటీఆర్, 'శ్రీనివాసరెడ్డి మీకు న్యాయం జరిగే వరకు మేం పోరాడుతం. అంతే తప్ప చావు సమస్యకు పరిష్కారం కాదు. దయచేసి చెబుతున్న. అటువంటి ఆలోచన ఎవరూ చేయద్దు. బతికుండి కొట్లాడుదాం. న్యాయం జరిగే వరకు ప్రభుత్వాన్ని నిలదీద్దాం' అంటూ ధైర్యం నింపారు. ఇంకో రైతు తోట వేణు 'వ్యవసాయ బావులకు త్రీఫేస్ కరెంటు రాత్రి 11 గంటల నుంచి ఇస్తామని అధికారులు మాకు మెసేజ్‌లు పెడుతున్రు' అంటూ తన సెల్‌ఫోన్‌లోని మెసేజ్‌ను చూపించగా, అక్కడే ఉన్న మంద తిరుపతి, మరికొంత మంది రైతులు కూడా స్పందించారు. 'ఇప్పటికే లో ఓల్టేజీ కరెంటు వస్తుంది. మోటర్లు కాలిపోతున్నయి. రాత్రి పూట మళ్లీ బాయి కాడ పండుకునే దుస్థితి దాపురించింది' అంటూ అవేదన వ్యక్తం చేశారు. రైతుల ఆవేదనను విన్న కేటీఆర్, 'మీరు ఎవరూ అధైర్య పడొద్దు. నీళ్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని అడుగుతం. అలాగే, పంట నష్ట పరిహారం విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తం. క్వింటాల్‌కు రూ.500ల బోనస్ ఇచ్చే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తం' అని హామీ ఇచ్చారు. 'మళ్లీ మీ అందరికీ విజ్ఞప్తి చేస్తున్న. కష్టాలు వస్తయి.. పోతయి. కానీ చావు అనేది ఏ సమస్యకూ పరిష్కారం కాదు' అని రైతులకు విన్నవించారు.

### పొలాలు ఎండకుండా చూడాలి

కాంగ్రెస్ ప్రభుత్వం సాగునీరివ్వాలి. ఒక్క ఇరుకుల్లలో కాకతీయ కాలువ కింద దాదాపు 500 ఎకరాల్లో పంట ఎండిపోయే దుస్థితి. తెలంగాణ ఏర్పడ్డ తర్వాత ఇలాంటి పరిస్థితి చూడలేదని రైతులే చెబుతున్నరు. ఎస్సారెస్పీలో నీళ్లున్నా రాజకీయ కక్ష కట్టి కొన్ని నియోజకవర్గాలకు నీరు ఇస్తూ.. మరికొన్నింటికి ఇవ్వకుండా చిల్లర రాజకీయాలు చేస్తున్నరు. రాత్రి 11 గంటల నుంచి త్రీఫేజ్ కరెంటు ఇస్తామని ఎన్పీడీసీఎల్ వారు డైరెక్ట్‌గా రైతులకు మెసేజ్‌లు చేస్తున్నట్టు పలువురు నా దృష్టికి తెచ్చిన్రు.క్షేత్ర స్థాయిలో పరిస్థితి ఇలా ఉంటే సీఎం మాత్రం కోతలు లేవంటున్నరు. కాలం బాగా కాలేదని, కరువు వచ్చే అవకాశం ఉందని సీఎం చెబుతున్నరు. అయితే, ఇది కేవలం కాంగ్రెస్ తెచ్చిన కరువే. కాలం ద్వారా వచ్చింది కాదు. ఆఖరికి ఒక రైతు అయితే 'అన్నా నేను ఉత్తరం రాసి సచ్చిపోత అంటున్నడు. ఇయాళ నా పదెకరాల పంట పోయింది. ఎవరు బాధ్యులు' అని అడుగుతున్నడు. దీనికి ప్రభుత్వమే సమాధానం చెప్పాలి. ఈ ప్రభుత్వానికి నిజంగా రైతుల మీద ప్రేముంటే వెంటనే యుద్ధ ప్రాతిపదికన మేడిగడ్డ వద్ద ఒక కాపర్ డ్యాం కట్టి, కనీసం ఒక్క పంపన్నా చాల్ చేసి నీళ్లియ్యాలి.

**- ఇరుకుల్ల పంటల పరిశీలన సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

### బావులకాన్నే పండే రోజు వచ్చింది



కాంగ్రెస్ ఏనాడూ ఎవుసాన్ని పట్టించుకోలె. సాగునీళ్లు ఇవ్వక, కరెంట్ సక్రమంగా ఇవ్వక అరిగోస పెట్టింది. బీఆర్ఎస్ సర్కారు వచ్చిన తర్వాత ఎవుసం బాగుపడ్డది. ఎల్లంపల్లి నుంచి నీళ్లు ఇయ్యడంతో పదేండ్లుగా ఏ బాధా లేకుంట బతికినం. కానీ మళ్లీ కాంగ్రెస్ సర్కారు వచ్చుడేందోగానీ.. పాత కథే అయితంది. ఎస్సారెస్పీ కాలువ నీరు సరిగ్గా ఇవ్వకపోవడంతో పంటలు ఎండిపోతున్నయ్.

**- మంద తిరుపతి, రైతు (గోపాల్‌పూర్)**

### పానీ నైయారా..?



నాకు ఇరుకుల్లలో రెండెకరాల భూమి ఉంది. 15 ఏండ్లుగా వరి వేస్తున్న. పానీ నైయారా..? పై నుంచి నీరు రాకపోవడంతో పంట ఎండిపోతంది. రాత్రి పుట కరెంట్‌తో ఇబ్బందైతుంది. ట్రాన్స్‌ఫార్మర్లతో లో వోల్టేజీ సమస్య అధికంగా ఉంది. మోటర్ల కాలిపోతున్నయి.

**- మహ్మద్ బాషు, రైతు (ఇరుకుల్ల)**

















